ప్రజాశక్తి
ఆదివారం 22 అక్టోబర్ 2023 | 5 | విజయనగరం



ఆర్‌డిఒగా సాయిశ్రీ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి ఆర్‌డిఒగా ఎ.సాయిశ్రీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆర్‌డిఒగా పని చేసిన వి.శేషశైలజ బదిలీ కావడంతో ఆమె స్థానంలో సాయిశ్రీ బాధ్యతలు స్వీకరించారు. నూతన ఆర్‌డిఒకు తహశీల్దార్ డోల రాజేశ్వరరావు, ఎఒ గణపతి, ఆర్‌ఐ కళ్యాణ్ చక్రవర్తి, విఆర్‌ఒలు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పారు.

ఆర్‌డిఒకు శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ అధికారులు

శివారు భూములకు అందని సాగునీరు

పొట్ట దశలో ఎండిపోతున్న వరి | ఆందోళనలో రైతులు

పొట్టదశకు వచ్చిన వారి చేలు కళ్లముందే ఎండిపోతుంటే రైతన్న కడుపు తరుక్కుపోతోంది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన వరి చేలు నీరు లేక నిరర్ధకంపోతుంటే రైతుల హృదయాలు బరువెక్కుతున్నాయి. ప్రాజెక్టుల కింద శివారు భూములకు నీరందక ఎక్కడ చూసినా కరువు ఛాయలు కనిపించడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుండి రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. పేరుకు తోటపల్లి ప్రాజెక్టు ఉన్నా శివారు భూములకు నీరందక పోవడంతో పొట్టదశలో ఉన్న వరిచేలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.

ఎం.సీతారాంపురంలో సాగునీరు లేక బీటలు వారిన పొలం

మద్దివలసలో సాగునీరు లేక గింజ కట్టలేదని చూపిస్తున్న రైతులు

ప్రజాశక్తి-వంగర

మండలంలో సుమారు పదివేల ఎకరాలకు పైబడి రైతులు వరి సాగు చేస్తున్నారు. చిన రాజుల గుమ్మడ, రుషింగి, తలగాం, వంగర, శివ్వాం, మద్ది వలస, ఎం.సీతారాంపురం తదితర గ్రామాలలో వరి సాగు ఎక్కువగా ఉంది. ప్రస్తుతం వరి చేలు పొట్టదశలో ఉన్నాయి. మరోవైపు ఎండలు తీవ్రతరంగా ఉండడంతో వరి పంట ఎండిపోతోంది. తోటపల్లి ప్రాజెక్టు నుంచి సాగునీరు అందించాల్సి ఉండగా, ఈ మండల భూములన్నీ శివారు ఉండడంతో నీరు అందడం లేదు. రైతులు సాగునీటి కోసం ఎన్నో పర్యాయాలు అధికారుల గానీ ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవటం లేదు. ఎండలు ఇలాగే కొనసాగితే, సాగునీరు అందకపోతే రైతులు ఆవేదన చెందుతున్నారు.

సాగునీటి వనరులున్నా.. అభివృద్ధి సున్నా..

మండలంలో సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ దానిని అభివృద్ధి చేయడంలో పాలకులు విఫలమవుతున్నారు. తోటపల్లి ప్రాజెక్టు నుంచి వంగర మండలానికి సాగునీరు అందించవలసి ఉన్నప్పటికీ శివారున ఉన్న ఈ మండలానికి కాలువలు సక్రమంగా లేక ఏటా నీరందడం లేదు. పక్కనే మడ్డువలస ప్రాజెక్టు నుంచి మండలంలోని మగ్గూరు, ఓని అగ్రహారం సంగాం గ్రామాలలో ఉన్న కొద్దిపాటి భూములకు మాత్రమే నీరందుతుంది. నాగావళి, తో పాటు వేగావతి సువర్ణముఖి నదులు వంగర మండలం గుండా ప్రవహిస్తున్నాయి. వీటిని గాని వినియోగించుకుంటే మరిన్ని ఎకరాలకు నీరందే అవకాశం ఉంది.

అధికారులు కనిపించడం లేదు

వరిచేలన్నీ పొట్ట దశలో ఉన్నాయి. ఎండలకు పొలాలు బీటలు వారుతున్నాయి. తోటపల్లి కాలువ నుంచి నీరందడం లేదు. అధికారులు సైతం కానరావడం లేదు. తోటపల్లి నీరు వస్తే వరిచేలు బతికే అవకాశం ఉంది.

-యలగాడ చిన్న కృష్ణమూర్తి, రైతు, మద్దివలస

రైతుల సహనాన్ని పరీక్షించొద్దు

ఖరీఫ్ ప్రారంభం నుంచి సాగునీటికి అనేక ఇబ్బందులు పడుతున్న ప్పటికీ ఎవరూ పట్టించు కోవడం లేదు. తోటపల్లి నీరు విడుదల చేస్తారని చాలా రోజులుగా ఎదురు చూస్తున్నా అధికారులెవరూ కనిపించడం లేదు. రైతుల సహనాన్ని పరీక్షిస్తే పోరాటం తప్పదు.

- గుంట్రెడ్డి సింహాచలం, రైతు, చినరాజుల గుమ్మడ

నివాళులర్పిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ; సంస్మరణ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్‌పి దీపిక

పోలీసు త్యాగాలతోనే

స్వేచ్ఛగా జీవిస్తున్నాం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం

పోలీసుల త్యాగాల వల్లే సమాజంలో స్వేచ్ఛగా జీవిస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలోని స్మృతి వనంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అమరవీరుల స్మృతి స్తూపం వద్ద కోలగట్ల, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి దీపిక పాటిల్, ఎఎస్‌పి అస్మా ఫర్హీన్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ సమర్థవంతంగా పని చేస్తేనే దేశంలో ప్రజలంతా సుఖంగా ఉంటారని తెలిపారు. విధి నిర్వహణలో వేరే ఆలోచనలు లేకుండా, పరిస్థితులకు అనుగుణంగా, అన్నింటిని అతి సూక్ష్మంగా పరిశీలిస్తూ, గంటల తరబడి నిలబడి, అంకితభావంతో విధులను నిర్వహిస్తున్నారన్నారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసులు మనందరిలో చిరంజీవులుగా నిలిచిపోతారన్నారు. కలెక్టరు ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడుటలో భాగంగా పోలీసులు రోజువారి విధులను నిర్వహించే క్రమంలో ప్రాణాలను కూడా కోల్పోతున్నారన్నారు. మావోయిస్టు దాడుల్లో ఐదుగురు పోలీసులు ప్రాణాలు కోల్పోయారని, వారిని స్మరించుకుంటూ, వారి కుటుంబాలకు అండగా ఉంటామని అన్నారు. ఎస్‌పి కార్యాలయం నుండి దిశ పోలీసు స్టేషను వరకు ఎస్‌పి ఎం.దీపిక ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది పోలీసు అమరవీరుల సేవలను కీర్తిస్తూ, ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. రిజర్వు ఇన్‌స్పెక్టరు ఎన్.గోపాలనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు పరేడ్ నిర్వహించారు. అమర వీరులకు తుపాకుల విన్యాసంతో ఘనంగా నివాళులర్పించారు కార్యక్రమంలో ఎస్ఇబి ఎఎస్‌పి ఎస్.వెంకటరావు, ఎఆర్ ఎఎస్‌పి ఎం.ఎం.సోల్మన్, డిఎస్‌పిలు ఆర్.గోవిందరావు, డి.విశ్వనాథ్, అసిస్టెంట్ సెంట్రల్ ఇంటిలిజెన్సు అధికారి లలిత్ మోహన్ పండా, డాక్టర్ మురళీ మోహన్, సిఐలు విజయనాథ్, ఇ.నర్సింహమూర్తి, జె.మురళి, బి.వెంకటరావు, ఎన్.హెచ్.విజయ ఆనంద్, టి.వి.తిరుపతిరావు, బి.నాగేశ్వరరావు, ఎం.బుచ్చిరాజు, ఆర్ఐ ఎన్.గోపాల నాయుడు, డిపిఒ పర్యవేక్షకులు ప్రభాకరరావు, కామేశ్వరరావు, పోలీసు అసోసియేషను రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం

పోలీసు అమర వీరుల కుటుంబాలతో ఎస్‌పి ఎం.దీపిక జిల్లా పోలీసు కార్యాలయంలో మమేకమయ్యారు. ఈ సందర్భంగా పోలీసు అమరవీరులు షేక్ ఇస్మాయిల్ సతీమణి షేక్ బాబీ జాన్, సూర్యనారాయణ సతీమణి రాజు, చిరంజీవిరావు సతీమణి విశాలాక్షితో మమేకమై, వారి యోగ క్షేమాలు, పిల్లల చదువు గురించి అడిగి తెలుసుకొన్నారు. అనంతరం వారితో కలిసి అల్పాహారం చేసి, కొంత సమయాన్ని గడిపారు. పండ్లు, నగదును ఎస్‌పి అందజేశారు. ఎప్పుడు ఏ అవసరమున్నా తమను సంప్రదించవచ్చని, అండగా ఉంటామన్న భరోసాను ఎస్‌పి దీపిక కల్పించారు.

29న ఉత్సవాల ప్రారంభోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 29న విజయనగర ఉత్సవాల ప్రారంభోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మెప్మా పీడీ సుధాకర్ తెలిపారు. కళాకారులు, విద్యార్థులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నిర్దేశించిన విధులను నిర్వహిస్తూ, చేసిన సూచనలను పాటిస్తూ భారీ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఉత్సవ ర్యాలీ ఏర్పాట్లపై జిల్లా పరిషత్తు విద్యా సమన్వయ అధికారి మన్మథ కుమార్, డిఎస్‌పి గోవిందరావు, ట్రాఫిక్ డిఎస్‌పి. విశ్వనాథ్‌తో కలిసి ఉత్సవ ర్యాలీ నిర్వహణపై శనివారం జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైడితల్లి అమ్మవారి ఆలయం నుంచి గురజాడ కళాభారతి వరకు నిర్వహించే ర్యాలీని మూడు జోన్లుగా విభజించామని తెలిపారు. అమ్మవారి ఆలయం నుంచి గంటస్థంభం వరకు జోన్-1, గంటస్థంభం నుంచి కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు జోన్-2, అక్కడి నుంచి స్టేట్ బ్యాంకు వరకు జోన్-3 గా ఏర్పాటు చేశామన్నారు. ర్యాలీలో పాల్గొనేవారు ఏ జోన్‌లో ఉండాలనేది నిర్దేశిస్తూ తెలియజేశామని చెప్పారు. ప్రదర్శనలో పాల్గొనే కళాకారుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు బ్యానర్లను ప్రదర్శించాలని కోరారు.

షార్ట్ ఫిల్మ్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం, పైడితల్లి అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకుని షార్ట్‌ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉజ్వల్ వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. అందుకుగాను ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 26లోగా తమ షార్ట్‌ఫిల్మ్ తీసి విజయనగరంలోని యూత్ వెల్ఫేర్ ఆఫీస్‌లో అందజేయాలని కోరారు. పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.15 వేలు, మూడో బహుమతిగా రూ.10 వేలతోపాటు మూడు కన్సోలేషన్ బహుమతులు రూ.3 వేలు చొప్పున విజయనగరం ఉత్సవాల చివరి రోజున అందజేస్తారు. షార్ట్ ఫిల్మ్ వివరాలను మెయిల్ dyc.vizianagaram@gmail.com కు పంపాలి. వివరాల కోసం 08922-274471, 7036485273 నంబర్లను సంప్రదించాలి.

అంశం : బాల్య వివాహాలు / పోషకాహార లోపం, రక్తహీనత

గైడ్ లైన్స్ : షార్ట్‌ఫిల్మ్ కాలవ్యవధి 5 నుంచి 10 నిమిషాల లోపు ఉండాలి. ● 15 నుంచి 30 ఏళ్ల వారు మాత్రమే అర్హులు. ● గత ఐదేళ్లలో బహుమతి పొందివారు అర్హులు కారు. ● డిక్లరేషన్ ద్వారా మీరు పంపిన ఫిల్మ్ ఇంతకు ముందు ఎక్కడా ప్రదర్శించలేదని తెలపాలి. ● విజేతలను న్యాయ నిర్ణేతలు ఎంపిక చేస్తారు.

నేడు మంత్రి బొత్స పర్యటన

విజయనగరం : విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదివారం నగరంలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకొని జిల్లాలోని గొర్రెల కాపరులకు టార్చ్ లైట్ లు, దుప్పట్లు, రెయిన్ కోట్‌లు పంపిణీ చేయనున్నారు. 23న ఉదయం 10.30 గంటలకు పార్వతీపురం చేరుకొని బస్సు యాత్ర సన్నాహక సమావేశంలో పాల్గొంటారు.

ఇళ్లు కట్టకపోతే రద్దు చేయండి

పట్టణాల్లో మరిన్ని ఆరోగ్య సురక్ష క్యాంపులు ● వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నాగలక్ష్మి

మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

మంజూరైన ఇళ్లు కట్టుకోకపోతే రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. అవసరమైతే పట్టాలను కూడా రద్దు చేస్తామని అన్నారు. కొంతమంది లబ్ధిదారులు పునాదులు వేసి వదిలేశారని, పని ఆపేస్తే అది ఏ స్టేజ్‌లో ఉన్నా రద్దు చేస్తామని స్పష్టం చేశారు. రద్దు చేసిన ఇళ్లను అర్హులకు అందజేయాలని సూచించారు. ఎంపిడిఒలు, ఎంఇలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమినిటీస్ సెక్రటరీలతో శనివారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న ఇళ్ల నిర్మాణం, ప్రాధాన్యతా భవనాలు, జనగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్షించారు. ఆయా మండలాల ప్రగతిపై ప్రశ్నించారు. నవంబరు నాటికి మంజూరైన ఇళ్లన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణానికి ముందుకు రాని లబ్దిదారుల ఇళ్లను, ఇళ్ల పట్టాలను కూడా రద్దు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమినిటీ సెక్రటరీలు ఇళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షించి, ప్రతిరోజూ ప్రగతిని నమోదు చేయాలని సూచించారు. జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలని అన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల గురించి వలంటీర్లు, ఇతర సిబ్బంది ద్వారా ఇంటింటికీ విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. ప్రతీ సురక్ష శిబిరంలో ఇద్దరు పిహెచ్‌సి డాక్టర్లు, ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేసిన రోగులను పర్యవేక్షించి, వారికి నవంబరు 15 లోగా తదుపరి వైద్య చికిత్సను అందించాలన్నారు. ఆరోగ్య శ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడంతో పాటు, తమ పేర్లను యాప్‌లో రిజిష్టర్ చేసుకొనేవిధంగా చూడాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్, డిపిఒ నిర్మలాదేవి, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భగవాన్ దాస్ స్ఫూర్తితో క్రీడల అభివృద్ధి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కబడ్డీ, ఖోఖో పితామహుడు భగవాన్ దాస్ మాస్టారు స్ఫూర్తితో క్రీడల అభివృద్ధికి కృషి చేద్దామని కబడ్డీ ద్రోణాచార్య అవార్డు గ్రహీత విజ్జపురెడ్డి ప్రసాదరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కస్పా హై స్కూల్‌లో ఖో ఖో, కబడ్డీ పితామహులు వై. భగవాన్ దాస్ మాస్టారు వర్ధంతి క్రీడాకారులు నిర్వహించారు. ఆయన శిష్యులంతా కస్పా స్కూల్లో ఉన్న ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రసాదరావు మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో అంటే టక్కున గుర్తుకు వచ్చేది భగవాన్ దాస్ అన్నారు. క్రీడలు కోసం ఆయన చేసిన కృషినికొనసాగించి క్రీడలు అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో భగవాన్ దాస్ మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి రంగారావు దొర , రమణమూర్తి, ఖోఖో సంఘ చైర్మన్ చిన్నం నాయుడు, కార్యదర్శి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ రామారావు, కమలనాభరావు, అప్పన్న , కృష్ణ, తవుడు తదితరులు పాల్గొన్నారు.

5న శానిటేషన్ వర్కర్ల జిల్లా సదస్సు

విజయనగరం టౌన్ : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని నవంబర్ 5న కెఎల్‌పురంలోని ఎన్‌పిఆర్ శ్రామిక భవన్‌లో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సుధారాణి, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు ఎ. జగన్మోహన్, బి.రమణ తెలిపారు. శనివారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఇఎస్ఐ, పిఎఫ్, వీక్లీ ఆఫ్ తదితర సౌకర్యాలు కల్పించాలని, ప్రతినెలా జీతాలు చెల్లించాలని, పని భారం తగ్గించాలని, యూనిఫాం , మాస్కులు, గ్లౌజులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలపై జరిగే జిల్లా సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో స్కూల్ ఆయాలు సత్తమ్మ, లక్ష్మి, అంజలి, లతా, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

బివైవిపిఎల్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

విజయనగరం టౌన్ : నవంబర్ 14న జరగనున్న బిజినెస్ యూత్ ఆఫ్ విజయనగరం ప్రీమియర్ లీగ్ సీజన్ - 2కు సంబంధించిన గోడ పత్రికలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శనివారం ఆవిష్కరించారు. రామనారాయణం రోడ్డులోని గ్రోవ్ స్పోర్ట్స్ పార్క్ వేదికగా జరిగే ఈ క్రికెట్ పోటీల ద్వారా వచ్చిన మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు, ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి వెచ్చించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పారిశ్రామిక అభివద్ధి మండలి డైరెక్టర్ సంగంరెడ్డి బంగారునాయుడు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు, లీగ్ సమర్పకులు జి.ఈశ్వర్ కౌశిక్, కార్పొరేటర్లు అల్లు చాణక్య, బండారు ఆనంద్ పాల్గొన్నారు.

విజయ ఢంకా మోగించాలి

26 నుంచి బస్సు యాత్ర : మంత్రి మేరుగు నాగార్జున



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పేదల అభ్యున్నతికి శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2024 జరగనున్న ఎన్నికల్లో గెలిపించుకోవాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. శనివారం ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్‌లో గల రెవెన్యూ కళ్యాణ మండపంలో వైసిపి దళితుల ఆత్మీయ కలయిక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈనెల 26 నుంచి తలపెట్టిన సామాజిక సాధికారిత బస్సుయాత్రను విజయవంతం చేయటంలో దళితులు కీలక పాత్ర పోషించాలన్నారు. చంద్రబాబు పాలనలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు తప్ప చేసిందేమి లేదన్నారు. విశాఖలో దళిత మహిళను వివస్త్రను చేస్తే చంద్రబాబు కనీసం పట్టించుకోలేదన్నారు. గత ప్రభుత్వ పాలనలో దళితులపై దారుణాలు జరిగితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బిసిల సామాజిక వర్గాల అభ్యున్నతికి పెద్ద పీట వేస్తున్నారని చెప్పారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి జిల్లాలో ఎస్‌కోట, గజపతినగరం, పార్వతీపురం, రాజాం నియోజకవర్గాల్లో జరిగే బస్సు యాత్రలను విజయవంతం చేయాలని అన్నారు. ఎమ్మెల్సీ ఎం.అరుణ్‌కుమార్, వైసిపి ఎస్‌సి సెల్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, జూపూడి ప్రభాకరరావు, రాజాం, పార్వతీపురం ఎమ్మెల్యేలు కంబాల జోగులు, అలజంగి జోగారావు మాట్లాడారు.

ఎపి టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి, ఎస్‌సి సెల్ జోనల్ ఇన్‌ఛార్జి కంబాల సందీప్, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు పి.జైహింద్‌కుమార్, జిల్లా కార్యదర్శి రొంగలి పోతన్న, ఎపి టూరిజం డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలని ఆక్రందన దీక్ష

దీక్షలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎస్‌టియు ఆధ్వర్యాన శనివారం కలెక్టరేట్ వద్ద ఆక్రందన పేరుతో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌టియు ఉపాధ్యక్షులు కె.జోగారావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు వివిధ బిల్లులకు సంబంధించి పెండింగ్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, లేని పక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దీక్షకు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు మద్దతు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు వై.అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్యామ్, సిహెచ్ సూరిబాబు, వి గోవిందరావు, రవి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

మరోసారి కడుబండిని గెలిపించండి

వైసిపి ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి ● పార్టీ ఆదేశాలు శిరసావహించాలి : బొత్స

ప్రజాశక్తి - జామి

'వచ్చే ఎన్నికల్లో మరోసారి కడుబండిని గెలిపించండి. పార్టీ అదేశాలు శిరసావహించండి' అని వైసిపి ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి వైవి సుబ్బారెడ్డి అన్నారు. ఈనెల 26నుంచి తలపెట్టిన సామాజిక సాధికారిత బస్సుయాత్రను విజయవంతం చేసేందుకు వైసిపి విస్తృత సమావేశం శనివారం లక్కవరపుకోటలో జరిగింది. ముఖ్యఅతిథులుగా వైవి సుబ్బారెడ్డితో పాటు రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్య నారాయణ,పార్టీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు హాజరయ్యారు. వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రజల్లో మమేకమై నిత్యం పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువచేయడంలో ఎమ్మెల్యే కడుబండి చేసిన కృషిని అభినందించారు. రానున్న మూడునెలల్లో పార్టీ నిర్వహించనున్న కార్యక్రమాలను వివరించారు. వాటిలో ప్రధానంగా ' వై ఎపి నీడ్స్ జగన్, సాధికార బస్సు యాత్రలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా నిత్యం ప్రజల మధ్య ఉంటూ, అందరికీ అందుబాటులో ఉన్న కడుబండి శ్రీనివాసరావును రానున్న ఎన్నికల్లో మళ్లీ గెలిపించాలని పార్టీ శ్రేణులకు చెప్పారు. ఆయన చేసిన కృషిని గుర్తించి ఆయనకే పార్టీ టిక్కెట్ కేటాయించిందని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలను మాత్రమే తాను ప్రకటిస్తున్నానని చెప్పారు. వైవి సుబ్బారెడ్డి ప్రకటనతో ఎమ్మెల్యే కడుబండికి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ విషయంలో లైన్ క్లియర్ అయ్యింది. నియోజకవర్గం లో వైసిపి శ్రేణుల్లో ఉన్న గందరగోళానికి దాదాపుగా తెర పడింది. కార్యకర్తలంతా ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. వైవి ప్రకటనకు తోడుగా బొత్స పార్టీ అదేశాలు శిరసావహించాలని చెప్పారు. ఎమ్మెల్సీ రఘురాజు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

మీసానికి సంపంగి నూనెట!

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మింగ మెతుకులేదంటే మీసానికి సంపంగి నూనె వేసుకోమన్నాడట వెనుకటి ఓ వ్యక్తి. రైతులకు అధికార యంత్రాంగం ఇస్తున్న సలహాలు అచ్చం అలాగే ఉన్నాయి. అసలు నీరే లేదంటే నీటి వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తారట. ఇందుకనుగుణంగా మొన్న (శుక్రవారం) జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో పాలకులు, అధికారులు కలిపి కీలక నిర్ణయం చేశారు. ఈ విషయం క్షణాల్లో సోషల్ మీడియా ద్వారా బయటకు వెళ్లడంతో ఔరా..! అంటూ రైతాంగం ముక్కున వేళ్లేసుకుంటోంది. జిల్లాలో సుమారు 70శాతం ప్రజానీకం వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. మరో 10 నుంచి 15శాతం మందికి కూడా పరోక్షంగా వ్యవసాయ రంగమే జీవనాధారం. ఇటువంటి జిల్లాలో వ్యవసాయ ప్రాధాన్యత ఏ మేరకు ఉండాలో ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. ఈనేపథ్యంలో క్షేత్రస్థాయిలో వ్యవసాయ సాగు, ఆచరణలో ఇబ్బందులు, తెగుళ్లు, రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అందులో భాగంగా నమోదు చేయాల్సిన ఇ-క్రాప్, ఇన్సూరెన్స్ వంటి నమోదు కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సమీక్షచేసి రైతులకు చేదోడు వాదోడుగా ఉండేందుకు వ్యవసాయ సలహా మండళ్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ, ఇవి కొన్నాళ్లగా మొక్కుబడిగా సాగుతున్నాయి. ముఖ్యంగా మండలి సభ్యులు, చైర్మన్ మాట్లేందుకు అవకాశం ఇవ్వడం లేదు. ఇంకా చెప్పాలంటే వారు కూడా మాట్లాడేందుకు చొరవ చూపడం లేదు. జెడ్‌పి చైర్మన్ అన్నీ తానై వ్యవహరించడం కూడా ఇందుకు ఒక కారణమని పలువురి వాదన. ఈ సంగతి కాస్త పక్కనబెడితే సమావేశంలో క్షేత్ర స్థాయి పరిస్థితులపై చర్చ సాగడం లేదు. శుక్రవారం నాటి సమావేశంలోనూ ఇదే రకమైన పరిస్థితి కనిపించింది. జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, జలాశయాల్లో ఉన్న నీటిని సక్రమంగా వినియోగించుకునేలా రైతులకు అవగాహన కలిగించాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు అధికారులకు సూచించారు. వాస్తవానికి నీరు లేక పొలాలు, ముఖ్యంగా వరి పంట ఎండిపోతోంది. కొన్ని చోట్ల బీటలు వారుతున్నాయి. తోటపల్లి నుండి ఈ ఏడాది 55 వేల ఎకరాలకు నీరందించాలని లక్ష్యం కాగా ఇప్పటికే 45 ఎకరాల వరకు అందించామని అధికారులు సెలవిచ్చారు. వాస్తవానికి అంత నీరు అందడం లేదు. గుర్ల, చీపురుపల్లి, పూసపాటిరేగ మండలాలకు ఈ ఏడాది అసలు నీరే అందలేదు. వర్షపునీటితో ఉబాలు పట్టుకున్నారు. తాజాగా ఆ పంటలన్నీ ఎండిపోతున్నాయి. గత నాలుగేళ్లలో గడిగెడ్డకు నీరు రాకపోవడం ఇదే మొదటిసారి అంటూ గుర్ల రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. పిల్లకాలువలు పూర్తి కాకపోవడం, కాలువల నిర్వహన గాలికి వదిలేయడమే ఇందుకు కారణం. దీన్ని కప్పిపుచ్చుకునే విధంగా సమావేశంలో చర్చసాగినట్టుగా పలువురు విమర్శిస్తున్నారు. ఆండ్ర, తాటిపూడి, మడ్డువలస, పెద్దగెడ్డ, వెంగళరాయ సాగర్ తదితర జలాశయాల్లో నీరు పుష్కలంగానే ఉందంటూ జలవనరుల శాఖ అధికారులు సెలవిచ్చారు. అందుకు జెడ్‌పి చైర్మన్, కలెక్టర్ సహా ఓహో అటూ తలూపేశారు. కానీ, జలాశయాల్లో నీరు ఉంటే పొలాలు ఎందుకు ఎండిపోతున్నాయని మాట వరుసకు కూడా అడగకపోవడం గమనార్హం. ఉన్ననీరు కూడా పొలాల్లోకి వెళ్లే విధంగా కాలువల నిర్వహణ లేదు. వర్షపాతం నమోదు కూడా రైతాంగాన్ని ఆందోళన కలిగిస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో అన్ని పంటలూ కలిపి 2,83,912 ఎకరాల్లో సాగవ్వగా, వరి అత్యధికంగా 2,34,437 ఎకరాల్లో సాగైంది. సీజన్ ముగిసేనాటికి (జూన్ నుంచి సెప్టెంబర్ వరకు) సాధారణ వర్షపాతం నమోదైనప్పటికీ జూన్‌లో 52 మిల్లీ మీటర్లు, ఆగస్టులో 24 మి.మీ వర్షపులోటు ఏర్పడడంతో ఉబాలు పట్టుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడాల్సివచ్చింది. అక్టోబర్ 1 నుంచి ఇప్పటి వరకు చినుకు రాలలేదు. 87మి.మీ లోటు వర్షపాతం నమోదైంది. దీనికితోడు ఎండ తీవ్రత కూడా ఎక్కువగా ఉండడంతో వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలన్నీ ఎండిపోతున్నాయి. పంటపొలాలు బీటలు వారుతున్నాయి. ఈనేపథ్యంలో జలాశయాల్లో ఉన్న కొద్దిపాటి నీటిని అందించేందుకు కాలువలు ఉన్నంతలో బాగుచేయించడం లేదా కరువు పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కనీసం చర్చిండం వంటి చర్యలకు సమావేశంలో కనీసం ప్రయత్నించకపోవడం గమనార్హం. ఇక ఇకెవైసి, ఇన్సూరెన్స్, ఇ-క్రాప్ నమోదు వంటివి శతశాతానికి చేరుకోలేకపోవడానికి గల కారణాలు కూడా చర్చించలేదు. ఈనేపథ్యంలో ఇలాంటి సమావేశాలు ఎందుకని, 80శాతం ప్రజానీకం సమస్యలు ముప్పావుగంటలో ముగించారంటే వ్యవసాయ రంగంపై పాలకులకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమౌతోందని జనం చర్చించు కుంటున్నారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

అయోడైజ్డ్ ఉప్పు రక్షణ కవచం

ప్రజాశక్తి-విజయనగరం

అయోడైజ్డ్ ఉప్పు వినియోగంతో థైరాయిడ్ బారిన పడకుండా దోహద పడుతుందని డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు అన్నారు. 'గ్లోబల్ అయోడిన్ డెఫిసియన్సీ డిజార్డర్ డే' సందర్భంగా శనివారం వైద్యసిబ్బంది నిర్వహించిన ర్యాలీని డిఎంహెచ్ఒ జెండా ఊపి ప్రారంభించారు. అయోడైజ్డ్ ఉప్పు అతి గొప్ప రక్షణ కవచమని, థైరాయిడ్ భారిన పడకుండా ఉండేందుకు దోహద పడుతుందని అన్నారు. మెదడును అభివృద్ధి చేస్తుందని, జీవ క్రియను క్రమబద్ధీకరిస్తుందని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ఎన్.సూర్య నారాయణ, డాక్టర్ పి.రవికుమార్, ఎన్‌సిడిపిఒ వి.చినతల్లి, మలేరియా నివారణ అధికారి డాక్టర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒపిఎస్ అమలు చేసే వరకు పోరాటం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిపిఎస్, జిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే వరకు పోరాటం చేస్తామని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు డి ఈశ్వరరావు అన్నారు. శనివారం జిల్లా కార్యవర్గ సమావేశం లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పి ఇచ్చిన హామీ అమలు చేయకుండా ఉద్యోగులను నమ్మించి మోసం చేసిందన్నారు. మరో వైపు ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన డి ఎ, ఎపిజిఎల్ఐ, ఎరియర్స్ బకాయిలు వేల కోట్ల రూపాయల చెల్లించకుండా అన్యాయం చేస్తుందన్నారు. తక్షణమే రావాల్సిన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో ఉపాధ్యాయులు సమస్యలు,విద్యా రంగంలో వస్తున్న మార్పులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైసిపి పట్టణ విస్తృత స్థాయి సమావేశం

బొబ్బిలి : స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు పట్టణ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ఒకప్రకటనలో తెలిపారు. సమావేశంలో ఎన్నికల హామీల అమలు, రానున్న ఎన్నికల్లో వైసిపి విజయానికి చేయాల్సిన కృషిపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. సమావేశానికి పట్టణ నాయకులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అమర వీరుల త్యాగాలు మరువలేనివి

రామభద్రపురం : పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని బొబ్బిలి రూరల్ సిఐ తిరుమలరావు అన్నారు. శనివారం పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్ఐ సురేంద్ర నాయుడు ఆధ్వర్యంలో వారి సేవలు గుర్తుచేస్తూ పోలీస్ స్టేషన్ నుంచి 3 రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ చేస్తూ, మానవ హారం నిర్వహించారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు.

వర్షాభావ పరిస్థితులపై అవగాహన

ప్రజాశక్తి- డెంకాడ

వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వరి పంట నీటి ఎద్దడిని తట్టుకొనడానికి 13-0-45 ఎకరానికి రెండు కేజీలు 200 లీటర్లు కలిపి పిచికారి చేయాలని వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని సింగవరంలో శనివారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పంట పాలు పోసుకునే దశ నుంచి చిరు పొట్ట దశలో ఉందని 15 రోజుల నుంచి వర్షాభావ పరిస్థితులు వల్ల వరి పంటలో దుబ్బు చేసే పరిస్థితి చాలా తక్కువగా ఉందని చెప్పారు. రసం పీల్చే పురుగులు, ఆకుముడత, ఆకు ఎండు తెగులుతోపాటు దోమపోటు ఉధృతి ఎక్కువగా కనిపించిందని దోమపోటు నివారణకు పెక్సాలోన్ ఎకరాకు 100 గ్రాములు పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ శేష శైలజ

లింగ నిర్ధారణ పరీక్షలపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

లింగనిర్ధారణ పరీక్షలపై కఠినంగా వ్యవహరించాలని ఆర్‌డిఒ శేషశైలజ అన్నారు. శనివారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పిసి, పిఎన్‌డిటి చట్టం అమలుపై డివిజనల్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్ష చూపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏ ఒక్క స్కానింగ్ సెంటర్‌లో లింగనిర్ధారణకు పాల్పడినా చర్యలు తీసుకోవాలన్నారు. బాలికా లింగనిష్పత్తిని పెంచడానికి చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఆర్‌డిఒను వైద్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సంతోష్ కుమారి, పద్మావతి, స్వాతి, చిన్నతల్లి, తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

కళాకారులకు రూ.10వేలు పింఛనుఇచ్చి ఆదుకోవాలని ఎపి ప్రజానాట్యమడలి జిల్లా గౌరవాధ్యక్షుడు బుగత అశోక్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు అన్నారు. విప్లవ సినీ దర్శకులు అమరజీవి టి. కృష్ణ 36 వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వామపక్ష, విద్యార్థి, యువజనోద్యమాల పట్ల టి.కృష్ణ ఆకర్షితుడై ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. వామపక్ష, అభ్యుదయ భావాలతో సినీ రంగానికి విశిష్ట సేవలు అందించడంతో పాటు రాజశేఖర్, విజయశాంతి వంటి ఎంతోమంది నటి నటులను సినీరంగానికి పరిచయం చేశారని తెలిపారు. ఆయన ప్రజా సమస్యలు, సామాజిక సమస్యలను ప్రతిబింబించే కథలతో చిత్రాలు ఈతరం పిలిమ్స్‌బ్యానర్‌లో నిర్మించారన్నారు.

అన్నదానం గొప్పదానం

విజయనగరం టౌన్ : అన్ని దానాల కంటే అన్నదానం గొప్ప కార్యక్రమమని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు .ఆదివారం బిసి కాలనీలో దేవీ నవరాత్రి ఉత్సవాలులో భాగంగా అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమజానికి ఉపయోగపడే మంచి పనులు చేయాలని సూచించారు. మానవత విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు. కార్యక్రమంలో దేవీ నవరాత్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జెఎఎస్‌తో అందరికీ ఆరోగ్యం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. పట్టణంలోని సచివాలయం-4 పరిధిలో శనివారం ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. వైద్యశిబిరంలో సేవలు పొందుతున్న ప్రజలతో ఎమ్మెల్సీ మమేకమై, అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఐసిడిఎస్ పౌష్టికాహార శాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జగనన్న ఆరోగ్య కిట్లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ జి.సంతోషికుమారి, ఎంపిటిసిలు మజ్జి దేవి, బొడ్డేటి ఆదిలక్ష్మి, నాయకులు గంగరాజు, వాకాడ రమణ, వెంకటరమణ, ఎంపిడిఒ శేషుబాబు, ఇఒ లక్ష్మి పాల్గొన్నారు.

కొత్తవలస : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కోరారు. బలిఘట్టంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, వైస్ సర్పంచ్ పెనగంటి చెల్లయ్య, బోదల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి : వెదురువాడ సచివాలయంలో తహశీల్దార్ ప్రసాద్‌రావు ఆధ్వర్యం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ శిబిరాన్ని ఎంపిపి చల్ల చలం

శృంగవరపుకోట.. ఆరోగ్య సురక్ష కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

కొత్తవలస.. ఆరోగ్య సురక్ష కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

నాయుడు సందర్శించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశరావు, ఇఒపిఆర్‌డి సుగుణాకర్‌రావు, ఎంపిటిసి మోపాడ సరస్వతి, రాము, నారాయణ మూర్తి రాజు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్ అన్నారు. శనివారం 17వ డివిజన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కమిషనర్ ఆర్ శ్రీ రాముల నాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు తో కలిసి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి పాల్గొన్నారు.

వేపాడ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో అందరికీ వైద్య సేవలు అందినట్లు మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. ఇటీవల గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష ఆరోగ్య సేవలపై మండల స్థాయి అధికారులతో శనివారం మండల ప్రత్యేకాధికారి సమావేశాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్యాధికారులు, సిబ్బంది, ఐసిడిఎస్ అధికారులకు, సచివాలయ సిబ్బందికి అభినందనలు తెలిపారు. జగనన్నకు చెబుదాం యాప్ ద్వారా వచ్చిన వినతిపత్రాలను వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలు కూడా పూర్తి అయ్యే విధంగా కృషి చేయాలని కోరారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ

ప్రజాశక్తి-వేపాడ

రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, ఈ విషయాన్ని ప్రజలంతా గమనించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ తెలిపారు. మండలంలోని అంకాజోష్యులపాలెంలో తన నివాసం వద్ద శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాలను ఎన్నికల ముందు ఏ విధంగా మోసపూరితమైన హామీలను ఇచ్చి అధికారం చేజిక్కించుకున్నారో ఉత్తరాంధ్ర ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. రాజధాని అమరావతి పూర్తిస్థాయిలో నిర్మాణం జరగాలంటే 50 వేల ఎకరాలు అవసరం ఉంటుందని ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు తెలిపారని గుర్తుచేశారు. తాను అధికారంలోకి వస్తే అమరావతిని ఆరు నెలల్లో

పూర్తి చేస్తానని ప్రకటించారన్నారు. తీరా వైసిపి అధికారంలోకి వచ్చా విధ్వంసమే తప్ప ఎక్కడా అభివృద్ధి జాడ లేదన్నారు. ఇప్పుడు మళ్లీ ఉత్తరాంధ్ర అభివృద్ధి పేరుతో విశాఖపట్నంలో రుషికొండను సర్వనాశనం చేసి, ప్రజాధనం వెచ్చించి విలాసవంతమైన భవనాన్ని నిర్మించుకుంటున్నారని తెలిపారు. పేదల ఇళ్ల నిర్మాణానికి సెంటున్నర భూమినిచ్చి, లక్షల ఇళ్లు నిర్మిస్తున్నానంటూ సిఎం జగన్ సొంత పత్రికల్లో ప్రకటించుకుంటున్నారని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజలు జగన్మోహన్ రెడ్డి పరిపాలన ఏ విధంగా సాగుతున్నారో, ప్రజల సొమ్మును ఏ విధంగా దోచుకుంటున్నారో అర్థం చేసుకోకపోతే మన పిల్లల భవిష్యత్తును మనమే నాశనం చేసుకున్న వారవుతామని ఆందోళన వ్యక్తంచేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి

'బస్సుయాత్రను విజయవంతం చేయండి'

ప్రజాశక్తి - డెంకాడ

వైసిపి సామాజిక న్యాయ బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి కోరారు. మండలంలోని పెదతాడివాడ వద్ద నెల్లిమర్ల నియోజకవర్గ వైసిపి విస్తృత స్థాయి సమావేశం ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ రాష్ట్రానికి మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి ఎందుకు కావాలి కార్యక్రమం నంబరు ఒకటి నుంచి డిసెంబర్ 10వ వరకు ఉంటుందని, త్వరలో సామాజిక న్యాయ బస్సు యాత్ర నియోజవర్గంలో నిర్వహిస్తామని చెప్పారు. ఈరెండు కార్యక్రమాల్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. చంద్రబాబు నాయుడు అధికారం కోసం గతంలో 600 హామీలు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ 98శాతం నెరవేర్చడం జరిగిందన్నారు. చంద్రబాబు అవినీతికి పాల్పడి కోట్లు సంపాదించి జైల్లో ఉన్నాడని తెలిపారు. గ్రామాల్లో ప్రతి కుటుంబాన్ని, వ్యక్తిని కలిసి జగనన్న ఇచ్చిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఇలా చేయడం ద్వారా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు విజయానికి దోహదపడుతుందని తెలిపారు. వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పేదవాని పక్షాన వైసిపి నిలబడి యుద్ధం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు అందవరపు సూరిబాబు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, సొసైటీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

ప్రజాశక్తి-దత్తిరాజేరు

ప్రజా సంక్షేమం, అభివృద్ధి సిఎం జగన్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య తెలిపారు. మండలంలోని పెదమానాపురంలో నూతన నిర్మించిన సచివాలయ, రైతుభరోసా, వెల్‌నెస్ సెంటర్లను శనివారం ఆయన ప్రారంభించారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం వల్ల ఇళ్లు కోల్పోయిన వాళ్లు ఇబ్బంది పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో, తగు సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని బొత్స హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ వేమల ముత్యాల నాయుడు, ఎంపిపి గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్‌పిటిసి రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపిపిలు మామిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్ నాయుడు, మండల శ్రీనివాసరావు, సోమల శ్రీనివాసరావు , సర్పంచ్ గొట్టివాడ దాసు, ఎంపిటిసి కన్నయ్య, వైస్ సర్పంచ్ ఆదినారాయణ, ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

సిపి ఆక్వా అక్రమ లాకౌట్ ఎత్తివేయాలి

కార్మికులందరికీ పని కల్పించాలి: సిఐటియు

ప్రజాశక్తి - పుసపాటిరేగ

మండలంలోని జి.చోడవరంలోని సిపి ఆక్వా రొయ్య మేత పరిశ్రమ అక్రమ లాకౌట్‌ను వెంటనే ఎత్తివేసి కార్మికులందరికీ పని కల్పించాలని సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టివి రమణ, జిల్లా ఉపాధ్యక్షులు బి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్వల్పమైన కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన యాజమాన్యం లాకౌట్ చేయడం అన్యాయమన్నారు. ఈ అక్రమ లాకౌట్‌తో సుమారు 500 మంది కార్మికులు రోడ్డున పడ్డారని, పరిశ్రమను వెంటనే తెరాపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులూ లేకుండా చట్ట వ్యతిరేకంగా అప్రకటిత లాకౌట్ విధించటం అన్యాయమన్నారు. జిల్లాలో గల ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టరు, లేబర్ అధికారులు వెంటనే కలుగజేసుకొని పరిశ్రమను తెలిపించాలనీ డిమాండ్ చేశారు. యాజమాన్యం అన్ సీజన్‌లో కార్మికులను ఇబ్బందులు పెట్టి సీజన్ వచ్చాక నడపాలనే ఆలోచనతో ఈ కుట్ర పన్నిందన్నారు. ఇప్పటికే జిల్లాలో ఒక్కొక్కటిగా పరిశ్రమలు మూతపడుతున్నాయని ఉపాధి పోయి కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. దీనికి తోడు ఇప్పుడు పూసపాటిరేగ ప్రాంతంలో ముఖ్యమైన పరిశ్రమైన సిపి ఆక్వాను మూసి కార్మికులను రోడ్డున పడేయడంతో ప్రత్యక్షంగా 500 కుటుంబాలు పరోక్షంగా ఇంకొక 1500 కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. సిపి ఆక్వా యాజమాన్యం కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయకపోతే కార్మికులు చేసే పోరాటానికి సిఐటియు అండగా ఉండి పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

జనవరికి జామి అగ్రహారానికి మోక్షం

ప్రజాశక్తి - జామి

వచ్చే జనవరి నాటికి జామి అగ్రహార రైతులకు పట్టాలు అందించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని తహశీల్దార్ హేమంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అగ్రహారం భూముల సమస్యను వివరించారు. తాతల తండ్రుల నుంచి అగ్రహారం భూ సమస్య రైతులను వెంటాడుతున్న నేపథ్యంలో ప్రతి రైతుకు న్యాయం చేసే దిశగా చర్యలు చేపట్టినట్లు వివరించారు. 2,700 ఎకరాల్లో జామి అగ్రహారం భూములు ఉన్నాయన్నారు. ఈ ఏడాది జూలై 25న 2001 ఎకరాలకు పబ్లిక్ నోటీసు విడుదల చేశామన్నారు. ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే కారణంగా అగ్రహారం వ్యవహారం ముందుకు తీసుకెళ్లడంలో జాప్యం నెలకొందని చెప్పారు. 1416 మంది నుంచి అభ్యంతరాలు వచ్చాయని తెలిపారు. 250 ఎకరాలకు సంబంధించి న్యాయ స్థానాలలో కేసులు ఉన్నాయని వెల్లడించారు. 211 ఎకరాలకు గతంలో పాసు పుస్తకాలు ఇచ్చిన విషయాలను గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 26 నుంచి నెల రోజులు పాటు ఫీల్డ్ విచారణ ప్రారంభం కానున్నట్లు తెలిపారు. దీని కోసం నలుగురు సర్వేయర్లు, ఇద్దరు విఆర్‌ఒలను బృందాలుగా నియమించామని అన్నారు. ఈ ఏడాది చివరికి మొత్తం ప్రక్రియ పూర్తి చేసి, జనవరిలో పట్టాలు అందజేయాలన్నది లక్ష్యమని వివరించారు. అగ్రహారం సమస్య పరిష్కారానికి అందరూ సహకరించాలని కోరారు.

స్వచ్ఛంద సంస్థల సేవా నిరతి

ప్రజాశకి-విజయనగరం టౌన్

స్వచ్ఛంద సంస్థల సేవా నిరతి గొప్పదని.. ఆపద, అత్యవసర సమయంలో ప్రజలకు ధైర్యం కలిగిస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గోల్డెన్ అవర్.. గోల్డెన్ లైఫ్ సంస్థ సభ్యులు నగరంలో 10 ఉచిత అంబులెన్స్ సేవలను అందిస్తున్నారు. ఈ వాహనాలనుకోలగట్ల శనివారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటువంటి సమాజహిత కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. ఇంటి నుంచి ఆసుపత్రికి నగరంలోని ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉచితంగా సేవలు అందిస్తారని తెలిపారు. అత్యవసర సమయంలో సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వైసిపి నాయకులు భోగాపురపు రవిచంద్ర, మారం బాల బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుమారుడిని వెతుక్కుంటూ..

- వెయ్యి కిలో మీటర్లు దాటి వచ్చిన తండ్రి
- పోలిపల్లి టైర్లు పంచర్ యజమాని వద్ద పనిచేసిన కుమారుడు
- పది నెలలుగా కానరాని ఆచూకీ
- పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి- భోగాపురం

ఆ దంపతులకు ఆరుగురు పిల్లలు ఉన్నారు. అందులో పనికోసం ఇంటి నుంచి వెళ్లిన ఒక కుమారుడి ఆచూకి పది నెలలుగా కానరాలేదు. దీంతో తల్లడిల్లిన తండ్రి కుమారుడ్ని వెతుక్కుంటూ జార్ఖండ్ రాష్ట్రం నుంచి ఏకంగా వెయ్యి కిలోమీటర్లు దూరంలో ఉన్న మండలంలోని పోలిపల్లి గ్రామం వచ్చాడు. అయినా ఆచూకీ దొరకలేదు కదా పనిచేసిన యజమాని కూడా సహకరించలేదు. దీంతో ఏం చేయాలో తెలియక గత నాలుగు రోజులు ఇక్కడ వెతికాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఏమైనా ఆచూకి లభిస్తుందని స్థానికులు చెప్పడంతో చివరకు భోగాపురం పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపాడు ఆ తండ్రి.

జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఎమ్.డి గఫూర్, జరీనా దంపతులకు ఆరుగురు సంతానం. ఇందులో నలుగురు ఆడపిల్లలు, ఇద్దరు అబ్బాయిలు. ఇందులో రెండో కుమారుడైన ఫైదాన్ అన్సారీ(18)ని మండలంలోని పోలిపల్లి వద్ద మూసేసిన పెట్రోల్ బంకు సమీపంలో టైర్లు పంచర్లు దుకాణం నిర్వహిస్తున్న బీహార్‌కు చెందిన ఖుర్షిద్ అన్సారీ వద్ద వేరే వ్యక్తి ద్వారా గత ఏడాది అక్టోబర్‌లో పనికి కుదిరాడు. నెలకు 3వేలు జీతంతో పాటు వసతి కల్పించేందుకు ఒప్పందం కుదిరింది. మూడు నెలలు తరువాత ఫైదాన్ అన్సారి తండ్రి ఈ ఏడాది జనవరిలో పోలిపల్లి వచ్చినప్పటికి కుమారుడు కనిపించ లేదు. ఎక్కడని ప్రశ్నించగా సాలూరులో తన కుమారుడు రాజా నిర్వహిస్తున్న దుకాణంలో పని చేస్తున్నాడని

కుమారుడి ఫొటో చూపుతున్న తండ్రి

యజమాని చెప్పి చివరకు కలవనీయకుండా చేయడంతో వెనుదిరిగి వెళ్లిపోయాడు. ఈ ఏడాది జూలైలో అన్సారీ తల్లికి టైర్లు దుకాణం యజమాని ఫోనుచేసి మీ కుమారుడు కనబడడం లేదని ఎక్కడికో వెళ్లిపోయాడని చెప్పాడు. దీంతో తల్లడిల్లిన తండ్రి అక్కడ నుంచి పోలిపల్లి వచ్చి ఈ ప్రాంతంలో వెతకాడు. ఆచూకీ లేకపోవడంతో చివరకు శనివారం భోగాపురం వచ్చి స్థానిక పోలీసులను ఆశ్రయిస్తున్నట్లు చెప్పాడు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని రైతు మృతి

ప్రజాశక్తి భోగాపురం

మండల కేంద్రమైన భోగాపురంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రైతు అక్కడకక్కడే మృతి చెందాడు. భోగాపురం గ్రామానికి చెందిన పసుపులేటి వెంకటరావు (60) పొలం పనులు చూసుకొని సైకిల్‌పై ఇంటికి వస్తున్నాడు. ఇంతలో ముక్కాం వెళ్లే కూడలి వద్ద వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొంది. దీంతో ఆయన అక్కడకక్కడే మృతి చెందాడు. ఈయనకు భార్య కొండమ్మతో పాటు కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతిచెందిన రైతు

కొట్లాట కేసులో ఇద్దరు అరెస్టు

భోగాపురం : మండలంలోని తోటపల్లి వైన్‌షాపు వద్ద జరిగిన కొట్లాట కేసులో శనివారం ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ముక్కాం గ్రామానికి చెందిన వంకా నవీన్, మరో బాలుడు ఈ కేసులో ఉన్నట్లు గుర్తించారు. ఇందులో బాలుడిని విశాఖపట్నం జువైనల్ కోర్టుకు తరలించగా నవీన్ విజయనగరం కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

ఇసుక వాహనాల పట్టివేత

నెల్లిమర్ల : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాలను శనివారం ఎస్ఇబి అధికారులు పట్టుకున్నారు. కొండవెల గాడ జంక్షన్, చంపావతి నది, మొయిద జంక్షన్ పరిధిలో ఎస్ఇబి సిఐ జివిఎస్ రాజ శేఖర్ నాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ పి.నాగలక్ష్మి, డిటిఎఫ్ సిఐ రాజేశ్వరి, స్థానిక ఎస్ఐ పి.నారాయణ రావు వాహన తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా 3 లారీలు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న 34.5టన్నుల ఇసుక సీజ్ చేసి నెల్లిమర్ల పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ఈ సందర్భంగా సిఐ రాజ శేఖర్ నాయుడు మాట్లాడుతూ ఇసక అక్రమ రవాణా జరిపే వారిపై దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు.

IN THE HONORABLE COURT OF THE SENIOR CIVIL JUDGE COURT AT VIZIANAGARAM
IP.No.17/2023

Between: **Rai Srinivasa Rao** S/o Arjuna, Hindu, aged 44 years, residing at Saripalli village, Nellimarla mandal, Vizianagaram dist. ...petitioner

And: **Nadipana Nageswara Rao** and 6 others ...respondents

To, **Rrespondents:**

1. Nadipena Nageswara Rao S/o late Appanna, Hindu, aged 62 years, residing at Saripalli village, Nellimarla mandal, Vizianagaram dist.
2. Yelaka Krishna S/o Gangayya, Hindu, aged 42 years, rest do.
3. Kondeti Appa Rao S/o Appala Swamy, Hindu, aged 50 years, rest do.
4. Rai Krishna S/o Vibushana Rao, Hindu, aged 40 years, rest do.
5. Chinthada Siva S/o Yellayya, Hindu, aged 40 years, Sitaramudupeta village, Nellimarla mandal, Vizianagaram dist.
6. Vangalapudi Madeena S/o Pentayya, Hindu, aged 50 years, residing at Stadium Colony, Near Sri Ram Temple, Vizianagaram.
7. Rddi Ramesh S/o Sitam Naidu, Hindu, aged 45 years, residing at B-Block, Flat No. 407, Ome Shakti Towers, Vizianagaram.

PUBLIC LEGAL NOTICE

Please take notice that the petitioner in the above I.P. filed before the above Senior Civil Judge, Vizianagaram the above matter is stands posted to **02-11-2023** for apperance of the respondents here above. You should appear in person or through an advocate at **10-30 AM** on the above said date in the above court. If you fail to appear on the said date the Honourable Court will take appropriate decission against you.

A. HARISH
R. RAMAKRISHNA
Advocates,
Vizianagaram, Ph: 9490682844.